క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

మైదుకూరు(చాపాడు) : మండల పరిధిలోని నంద్యాలంపేట వద్ద 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ రామభద్రయ్య తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు సచివాలయాల్లో కోవిడ్ వ్యాక్సిన్

పోరుమామిళ్ల : మండలంలోని అన్ని సచివాలయాల్లో బుధవారం (నేడు) మెడికల్ ఆఫీసర్ వినోద్‌కుమార్, డాక్టర్ మేరీ థెరిస్సాల ఆధ్వర్యంలో కోవిడ్ వ్యాక్సిన్ వేయనున్నట్లు మండల ఆరోగ్యాధికారి సాధు వెంకటేశ్వర్లు తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన వారికి రెండవ డోస్, మరియు బూస్టర్ డోస్ ఇస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

చాపాడు : చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో అగపే ప్రార్థన చర్చి 7వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అగపే చర్చి ఫౌండర్ వర్గీ శ్యామ్, పాస్టర్ నాయక్ సిరాజ్ అతిథులుగా హాజరయ్యారు. పాస్టర్లు అబ్రహం, శేఖర్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ప్రార్థనలో పాల్గొన్నారు.

డిప్లమో ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

చాపాడు : స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ విడుదల చేసిన డిప్లమో మూడో సంవత్సరం 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంటు వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఈసీఈలో కె.ప్రవళ్లిక 95.70%, జ్ఞాపిక 95.20%, రేణుక 94.10%, ఈఈఈలో మహేంద్ర 86.63%, సాయి చందన ప్రియ 86.72%, రెడ్డయ్య 85.72%, ఇదే క్రమంలో సెకెండియర్ మూడో సెమిస్టర్‌లో ఈసీఈలో దస్తగిరి 90%, చంద్ర వర్షిత 89%, జయంతి 86.60%, ఈఈఈ శశాంక్ కుమార్ 86% మార్కులతో ఫలితాలు సాధించారని తమ కాలేజీ విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని కడప – బద్వేలు ప్రధాన రహదారిపై లింగాలకుంట గ్రామ సమీపాన ఆటో బోల్తా పడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి బద్వేలు నుంచి సిద్దవటం వైపు వస్తున్న ఆటో లింగాలకుంట వద్దకు వచ్చే సరికి ఆవులు అడ్డురావడంతో.. వాటిని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అట్లూరుకు చెందిన మండల గోపాలక్రిష్ణ, ఎస్.వెంకటాపురం తూడూరు కాలనీకి చెందిన విజయమ్మ, రెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసరావు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో అట్లూరు, గోపవరం 108 వాహనాలు వచ్చి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సులో వ్యక్తి మృతి

అట్లూరు : మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన ఓరుగంటి నరసింహులు (54) చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లి బస్సులో వస్తూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహులు అనారోగ్యంతో ఉండటంతో తన భార్య వెంకటసుబ్బమ్మను వెంట పెట్టుకుని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి బద్వేలు ఆర్టీసీ బస్సులో వస్తూ మృతి చెందాడు. ఆయనకు భార్యతోపాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అత్యాధునిక టెక్నాలజీతో సైంటిఫిక్ ట్రాక్

– కడప డీటీసీ మీరాకుమార్



ఆర్టీఓతో మాట్లాడుతున్న డీటీసీ మీరాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : అత్యాధునిక టెక్నాలజీతో సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కడప డీటీసీ మీరాకుమార్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న సైంటిఫిక్ ట్రాక్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న పరికరాలు, వాటి పనితీరు గురించి టెక్నీషియన్లు వివరించారు. అనంతరం డీటీసీ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా రవాణా శాఖలో కూడా డ్రైవింగ్ టెస్టింగ్ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా పూర్తి స్థాయి సెన్సార్ విధానంతో సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ పని చేస్తుందన్నారు. డ్రైవింగ్‌లో పాస్ కావడం, ఫెయిల్ కావడమన్నది ఇకపై అధికారుల ప్రమేయంతో జరగదని, సెన్సార్ ద్వారానే నిర్ణయించడం జరుగుతుందని చెప్పారు. జనవరి నెలాఖరుకు ట్రాక్ పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సుశీల, ఎంవీఐ నారాయణనాయక్, ఏఓ కరిముల్లా, లక్ష్మీకర్‌రెడ్డి, టెక్నాషియన్లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సమర్థవంతంగా పాలించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. మంగళవారం ఆమె మండలంలోని నరసాపురంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి రానున్న ఎన్నికల్లో జగనన్నకు మద్దతు పలకాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో స్థానికంగానే సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానికంగా రైతు భరోసా కేంద్రాలతో వ్యవసాయం, పశు సంపద అభివృద్ధికి, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌తో పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి రూ.లక్షకు పైనే లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిత్యారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మదార్, వెంకటేష్, పీరావలీ, జగన్ మోహన్‌రెడ్డి, సి. బాషా, ఎంపీడీఓ ముజఫర్‌రహీం, తహసీల్దార్ రామచంద్రుడు, హౌసింగ్ ఏఈ బాలిరెడ్డి, సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బద్వేలులో గడప గడపకు కార్యక్రమం..

బద్వేలు అర్బన్ : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంటరమణమ్మ, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, యద్దారెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగంసుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉండి ఇంకా ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వారిని గుర్తించి సంక్షేమ పథకాలను అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఇంటి స్థలాలు, ఇంటి బిల్లులు త్వరగా మంజూరు చేయాలని, డ్రైనేజీ కాలువలను నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలను పరిశీలించి వెటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ కోట్ల బీబీ, ఎంపీటీసీ కామనూరు సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సానేపల్లి బయపురెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేంద్ర, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బద్వేలు అర్బన్ : బద్వేలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బద్వేలు, బి.కోడూరు, బి.మఠం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎస్.వసంతబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని బి.మఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె (బీసీ–సీ), బి.కోడూరు మండలంలోని బి.కోడూరు–1 (ఎస్సీ) అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు బద్వేలు మండలంలోని వెంకటశెట్టిపల్లె (ఓసీ), వీరపల్లి (బీసీ–డీ), రాజుపాలెం–3 (ఎస్టీ), బి.మఠం మండలంలోని చౌదరివారిపల్లె (ఓసీ), మద్దిరెడ్డిపల్లె (బీసీ–సీ), బి.కోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె (ఎస్సీ), సిద్దుగారిపల్లె (ఎస్టీ), పాయలకుంట్ల (బీసీ–డీ) అంగన్వాడీ కేంద్రాల్లోని సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని, ఈ నెల 6వ తేదీలోపు బద్వేలు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రత్యూష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బసనపల్లె మినీ అంగన్వాడీ (బీసీ–డీ), కోడిగుడ్లపాడు సహాయకురాలు (ఓసీ) లకు కేటాయించారని తెలిపారు. పూర్తి వివరాలకు 8639542163 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఏకగ్రీవ దిశగా కోఆపరేటివ్ స్టోర్ ఎన్నికలు

10 డైరెక్టర్లకు 10 నిమినేషన్లు

ప్రొద్దుటూరు : స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని ది ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. మంగళవారం స్టోర్స్‌కు సంబంధించిన 10 డైరెక్టర్ల స్థానాలకు 10 మంది మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం నామినేషన్ల పరిశీలన, గురువారం నామినేషన్ల ఉపసంహరణ, 13వ తేదీ ఆఫీసు బేరర్లను ఎన్నుకోనున్నారు. డైరెక్టర్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మంచాల మదన్‌కుమార్, బత్రి లక్ష్మీరంగారెడ్డి, సి.రంగనాయకులు, ఎస్.మహ్మద్ షబ్బీర్, ఎన్.శ్రీరాములు, వెల్లాల వినోద్‌కుమార్‌రెడ్డి, వి.శివశంకర్ రెడ్డి, పాముగారి సురేంద్రనాథ్ రెడ్డి నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారిగా ఇ.అరుణకుమారి వ్యవహరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకర్ల నాగేషారెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ రాఘవరెడ్డి, చెన్నకేశవ రెడ్డి, బండారు సూరి, రాయపురెడ్డిలు గజ్జల కళావతిని అభినందించారు.

చిరుధాన్యాల సాగుతో ఆదాయం

అట్లూరు : మంచి పోషక విలువలున్న చిరు ధాన్యలను రైతులు సాగు చేయాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైన అట్లూరులో మంగళవారం చిరు ధాన్యాల సాగు, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఏ.రామకృష్ణారెడ్డి, మండల నాయకులు పిచ్చయ్య, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ సుజాతమ్మ, మండల వ్యవసాయాధికారి రామకృష్ణయ్య, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంట్లు రామ్మోహన్‌రెడ్డి, సందీప్, అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అట్లూరు ఆర్బీకే కేంద్రానికి పలు రకాల ఎరువులను సరఫరా చేశామన్నారు. అవసరమైన రైతులు ఆయా ఆర్బీకేల నుండి తీసుకెళ్ళాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బద్వేలు అర్బన్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అర్బన్ ఎస్ఐ కె.శ్రీకాంత్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎస్ఆర్ఎస్‌బీ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, సైబర్‌క్రైమ్, దిశ యాప్ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్ వారికి అండగా ఉంటుందన్నారు. అలాగే సైబర్ క్రైమ్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఆయా సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు మీనా, తేజస్విని, శ్రీలక్ష్మి, ప్రశాంతి, మల్లేశ్వరి, లక్ష్మి, వసుధ, వరలక్ష్మి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ప్రొద్దుటూరు క్రైం : చోరీ కేసులో నిందితుడికి ప్రొద్దుటూరు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం మండలం గోపాయపల్లె గ్రామానికి చెందిన బీరం వెంకటేశ్వరరెడ్డి 2019 అక్టోబర్ 24న కోర్టు వాయిదా నిమిత్తం ప్రొద్దుటూరు వచ్చాడు. కోర్టు పని ముగిసిన తర్వాత బ్యాంక్‌లో డబ్బు డిపాజిట్ చేయాలని అతను ఆటోలో బయలుదేరాడు. అయితే ఆటో దిగిన తర్వాత చూసుకోగా తన వద్ద ఉన్న డబ్బుల బ్యాగ్ కనిపించలేదు. దీంతో అతను రూ.2,20,000 చోరీకి గురైనట్లు అదే రోజు టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తికి చెందిన వెంకటగిరిరాజు, వెంకటగిరి మోహన్ చోరీ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయింది. దీంతో ఇరువురిని అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద సొత్తు రికవరీ చేశారు. కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో మొదటి ముద్దాయి అయిన వెంకటగిరి రాజుకు ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ హారిక మంగళవారం ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు నిందితుడు వెంకటగిరి మోహన్‌పై నేరం రుజువు కాకపోవడంతో.. అతన్ని వదిలేశారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరు పరచి నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన సీఐ ఇబ్రహీం, కోర్టు కానిస్టేబుల్ ఎం.విజయరామరాజులను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు : ఐసీడీఎస్ ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ బ్యాక్ సైడ్, ఇందిరానగర్–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. రిజర్వేషన్ల ప్రకారం పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. అలాగే ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టుకు సంబంధించి సీతంపల్లి, లింగాపురం–1, వెంగళరెడ్డిపేట, వెంకటేశ్వర్ల కొట్టాల, దొమ్మరవాడ, నంగనూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రూరల్ సీడీపీఓ అరుణ కుమారి తెలిపారు. 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 11వ తేదీ జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తొండూరు విద్యార్థిని



ప్రిన్సిపాల్ తులశమ్మ చేతులమీదుగా ట్రోఫీని అందుకుంటున్న విద్యార్థిని కవిత

తొండూరు : జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తొండూరుకు చెందిన విద్యార్థిని కవిత ఎంపికైందని ప్రిన్సిపాల్ తులశమ్మ మంగళవారం తెలిపారు. 66వ ఫుట్‌బాల్ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్ కం సెలెక్షన్స్‌లో తొండూరు అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన కవిత ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైంది. కవితకు ప్రిన్సిపాల్ తులశమ్మ ట్రోఫీని అందించి అభినందనలు తెలిపారు. ఎంపికపట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి ఎన్నారై విరాళం



ఆలయ చైర్మన్‌కు విరాళాన్ని అందజేస్తున్న ఎన్నారై దంపతులు

గోపవరం : మండలంలోని ఓబుళం గ్రామం సమీపంలో ఉన్న మల్లెం కొండేశ్వరస్వామి దేవస్థానం కొండపైన భక్తుల దాహార్తి తీర్చేందుకు ఎన్నారై మల్లికార్జునరెడ్డి రూ.1,00,116లు విరాళాన్ని అందజేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతి ఏటా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మల్లెం కొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. కొండపై శాశ్వత తాగునీటి సదుపాయం కల్పించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించగా ఎన్నారై యర్రు మల్లికార్జునరెడ్డి, ఆయన సతీమణి రేణుకలు మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లెగోవిందరెడ్డికి విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబాన్ని ఆలయ కమిటీ సత్కరించింది.

ఘన సన్మానం



భీమునిపల్లి లక్ష్మీదేవి, పాతకోట బంగారు మునిరెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : స్థానిక మోడంపల్లె బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. మోడంపల్లెలో నూతన బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్మాణం కోసం సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు ఓంశాంతి భవనం నిర్వాహకులు సన్మానించారు.

అరుణాచలంకు బస్సు సౌకర్యం

మైదుకూరు(చాపాడు) : అరుణాచలంకు పోరుమామిళ్ల, మైదుకూరు, కడప ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో ఎస్టీఐ మంజులకిరణ్ తెలిపారు. ఈనెల 4న శనివారం, ఆదివారం అరుణాచలం వెళ్లేందుకు పోరుమామిళ్ల నుంచి రాత్రి 8 గంటలకు, మైదుకూరు నుంచి 9.30 గంటలకు, కడప నుంచి 10.30గంటలకు ఆయా బస్టాండ్‌ల నుంచి బస్సులు ఉంటాయన్నారు. పోరుమామిళ్ల నుంచి రూ.1,360లు, మైదుకూరు నుంచి రూ.1,200లు, కడప నుంచి రూ.1,090లు టిక్కెట్టు ధరలతో ప్రయాణికులు అరుణాచలం వెళ్లేందుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు ఎస్టీఐ తెలిపారు.

అమృతానగర్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అమృతానగర్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అమృతానగర్‌లోని 4వ సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పలు చోట్ల కాలనీ ప్రజలు సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువలను నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. వర్షాకాలంలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీధి లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యలన్నింటినీ విన్న ఎమ్మెల్యే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముందుగా గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతారని, ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఎంపీటీసీ డిష్ శ్రీను, వార్డు మెంబర్లు అచ్చుకట్ల బీబీజాన్, లక్ష్మీనారాయణరెడ్డి, మోషా, సుమలత, స్వాతి, హనుమాన్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్ యాదవ్, అరుణకుమారి, తాటి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

సూరిశిద్దుపల్లె రామాలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

పోరుమామిళ్ల : మండలంలోని సూరిశిద్దుపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామి నూతన విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుంభాభిషేకం జరుగుతుందన్నారు. 2, 3 తేదీల్లో ఉదయం, సాయంత్రం అభిషేకాలు, అర్చనలు, హోమాలు, పారాయణాలు, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 4వ తేదీ ఉదయం యంత్ర, విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్టలు, ప్రాణ ప్రతిష్ట ఉంటుందన్నారు. అనంతరం 10 గంటలకు సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలానే మూడురోజులపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న ఏఓ అరవిందనాయక్

గోపవరం : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని రైతుభరోసా కేంద్రాలు, ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అవసరమైన మేరకు ఎరువులు ఆర్బీకే కేంద్రాలు, ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక రేట్లకు విక్రయించినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రబీ సీజన్‌లో వరి, ప్రొద్దుతిరుగుడు, పత్తి, సజ్జ, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగులో ఉన్నాయని, ఎరువులు అవసరమైన రైతులు ఆయా ఆర్బీకే కేంద్రాలకు వెళ్ళి ఎమ్మార్పీ ధరలకే ఎరువులు తీసుకోవచ్చని తెలిపారు. ఎరువుల డిమాండ్ ఉన్నట్లతైే ఆర్బీకే సిబ్బంది ముందస్తుగా సమాచారం ఇస్తే రెండు, మూడు రోజుల్లో సరఫరా చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం

- కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో పెట్రోలు, డీజిల్ బంకును ఏర్పాటు చేశామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. ఏడాదిలో పెట్రోలు, డీజిల్ అమ్మకాల ద్వారా రూ.59,07,440 ఆదాయం వచ్చిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ గతేడాది జనవరి 5న పెట్రోలు బంకును ఏర్పాటు చేశామన్నారు. డిసెంబర్ నాటికి రూ.29,28,25,424 పెట్రోలు, డీజల్‌ను అమ్మడం జరిగిందని, వీటి అమ్మకాలకు సంబంధించి అన్ని ఖర్చులు పోను రూ.59 లక్షలు ఆదాయం రావడం హర్షిస్తున్నామన్నారు. ఇందుకు కారణమైన వినియోగదారులందరికి ఆయన సమావేశంలో పాదాభివందనాలు తెలిపారు.

- త్వరలో ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, ఇర్ఫాన్ బాషా, గరిశపాటి లక్ష్మీదేవి, జిలాని బాషా, వెంకటసుబ్బారెడ్డి కోరారు. ప్రజా ప్రతినిధులు సహకరిస్తే రెండు రోజుల్లోనే పూర్తి ఆక్రమణలను తొలగిస్తామని ఏసీపీ మునిరత్నం తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి, కౌన్సిలర్లందరం ఏకగ్రీవ తీర్మానం చేసి ఆక్రమణలపై ముందుకు వెళతామని వైస్ చైర్మన్ తెలిపారు.
- కాంట్రాక్టు పనులకు సంబంధించి బిల్లుల తయారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి తెలిపారు. బిల్లుల తయారీకి సంబంధించి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ఏర్పాటు చేసినందున జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు.
- మూడు నెలలైనా తమ వార్డులో శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభం కాలేదని 21వ వార్డు కౌన్సిలర్ కొవ్వూరు స్వాతి ప్రశ్నించారు. వైఎంఆర్ కాలనీలోని సున్నపువారి వీధి కాలనీ వాసుల కోరిక మేరకు ప్రగతి నగర్‌గా పేరు మార్చాలని కౌన్సిల్ తీర్మానించింది. ఇంటింటా చెత్త సేకరణ వాహనాలకు టైర్లు, బ్యాటరీల కొనుగోలుకు రూ.15లక్షలు మంజూరు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రొద్దుటూరు క్రైం : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బొకరాపేట వీధిలో మంగళవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్) ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ రోడ్డులోని అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడారు. డీపీఎంఓ శివశంకరయ్య , సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, 2వ వార్డు సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్ : కుష్టువ్యాధి పట్ల అపోహలను తొలగించుకుని కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వలీ పేర్కొన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న స్వర్ణలత, డాక్టర్ రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు పోలీస్‌స్టేషన్ల పరిశీలన

మైదుకూరు (చాపాడు) : మైదుకూరు అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మంగళవారం పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌ల ఆవరణాలలో మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించేలా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆవరణాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో సమన్వయంతో నాటు సారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వంశీధర్‌గౌడ్, రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.